# చల్ మోహనరంగ.... I

ఒక పెన్సిలూ, నోటు బుక్కూ తీసుకురండి. మొగుళ్ళ పెంపకం గురించి నోట్సు చెప్తాను రాసుకుందురుగాని, మొగుళ్ళ పెంపకమేవిటి కోళ్ళ పెంపకంలాగ అని ఆశ్చర్యపోకండి. వాళ్ళమ్మ పెంచి మన కిస్తుందా మొగుడ్ని, వియ్యపురాలి లాంఛనాలూ అవీ పుచ్చుగుని - దానర్థ మేవిటి? వీడ్నిక నేను పెంచలేను, నువ్వు పెంచుకోవేఅమ్మాయీ అని. అప్పుడు రారమ్మని మీరే మొగుడ్ని పెంచుకోవాలి, కంటికి రెప్పలా. అంటే మీ దగ్గరో "రిమోట్ కంట్రోల్" వుంటుంది. పెళ్ళాంలోకూడా తల్లి దాగోనుంటుందని నర్మగర్భితంగా చెప్పా నిదివరకోసారి. తల్లి అంటే కనిపారేసే ఆటోమేషన్‌కాదు. మమతానుబంధాలతో పెంచే మమకారపు ముద్ద - అంటే చలివిడి ముద్దకాదు. చల్లగా, తియ్యగా, ప్రేమగా, లాలనగా చూసుకోవాలి మొగుడ్ని, అప్పుడప్పుడు-గిల్లొచ్చు-గిల్లినా, కొరికినా అందులో మాధుర్యం వుండాలి. ప్రేమ గిల్లులూ, ప్రేమ కొరుకులూ పడకుండా మొగుడ్ని పెంచి యింతవాడిని అంత వాడిని చేయటం మాటలు కాదు.

అప్పుడప్పుడో దెబ్బ చిన్నది వేయొచ్చు. కాని నెత్తిమీద వాళ్ళమ్మ యిదివరకే వేసుంటుంది. వాళ్ళ మాష్టారు వీపు మీద వేసుంటారు. ఆటల్లోపడో, చిన్నప్పుడు సైకిలు మీంచి పల్టీలుకొట్టో, మోచేతులూ, మోకాళ్ళూ డోక్కుపోయుంటాయి. మనం బుగ్గమీద వేయొచ్చు, ముక్కుపట్టుగు ఆడించొచ్చు. చెవి మెలిపెట్టొచ్చా అని అడుగుతున్నారా-వన్ మినిట్ మీరు పొట్టి బుడంకాయ కాకపోతే ట్రయి చేయండి. లేకపోతే ఒక స్టూలు వేసుకుని నిలబడి చెవి తిప్పండి.

చెవి తిప్పేముందు చెవి పరీక్ష చేస్తున్నట్లు గులివి తెడ్డో, అగ్గి పుల్లో, పుచ్చుగుని ఇష్ మాట్లాడకండి అని అతని బుర్ర వొంచి ట్రయ్‌డి గేంఫర్ సం టైమ్. ఇప్పుడది కనిపెట్టి చెవిలో ఏదో వుంది చూద్దా అని మీ మెడకాయ దగ్గర తన మెడకాయను తెచ్చి తనే ఆఫర్ చేస్తాడు. ఇప్పుడు టైం లేదు, ఓజీ!-" అని చెప్పండి

మీవారు ఆడపిల్లలా వుంటారని ఎవరేనా కామెంటుచేస్తే కోపం తెచ్చుకోకండి. ఏవండి మీరు ఆడపిల్లలా వుంటారటగా అని మెడ చుట్టూ చేతులువేసి స్టాప్, వద్దు-- ముందు గదితలుపులన్నీ వేసి కిటికీ కర్టెన్లు మూసివచ్చి అద్దం ముందు కూర్చోపెట్టి మేకప్‌చేయండి. ఇలాటి ప్రోగ్రాం ఏ ఆదివారం మధ్యాహ్నమో, యింట్లో ఎవరూ లేనప్పుడు ప్రారంభించాలి. కాటుక పెట్టించుకోవడానికి మగాళ్లు పేచీపెడ్తారు. కాంతకు కాటుక కన్నులె అందం అన్నారని చెప్పండి. నేను కాంతను కానంటాడు. కాస్సేపు నువ్వు నాకు కాంతవే అని నచ్చచెప్పి కాటుక పెట్టి బుగ్గను చుక్కపెట్టి చీరకట్టుకోమనండి. అసలు జరీఅంచులు మీ కాళ్ళమీదెలా గుంటాయోచూద్దావని.... ఓపట్టాన లొంగరు. లుంగీకట్టుకోవడంలే అంతే. అని మభ్యపెట్టి, మోసంచేసి చీరకట్టి స్టూలుమీద కూర్చోపెట్టి నెత్తిమీద ముసుగేయండి. అప్పుడూ ఆలాఫ్ సడన్— తలుపు తీసి గదిలోంచి పారిపోండి-- అప్పటికి మీ ఫ్రండ్స్ ఎవరేనా లేడీస్‌ని వచ్చి తలుపు తట్టమనండి. ది యంగ్ మేన్ విల్ టరన్ మ్యాడ్.... మీరతడ్ని ఒక సిగరెట్‌పెట్టి అగ్గిపెట్టి యిచ్చి మంచం కింద దాక్కోమనండి. మీ చీర ఖరీదైనదైతే అగ్గిపెట్టె సిగరెట్‌పెట్టెయివ్వకుండా ఒక వీక్లీనో మంత్లీనో యిచ్చి చదువుకోమనండి. చాప, దిండు మరచెంబుకూడా సప్లయిచేయచ్చు. అప్పుడు మీ ఫ్రండ్సుని మీ బెడ్ రూంలోకి రానివ్వకండి. మీ బెడ్‌రూం ఒక అమ్యూజ్‌మెంటు పార్కు అనుకోగలరు.

అఫ్కోర్సు— కొందరు మగాళ్లు లుంగీలా చీరకట్టుకుని పైనస్లాక్ వేసుగుంటే బావుంటారు. పూర్వం మన ప్రబంధాల్లో నాయికా నాయకులు యిలా లీజర్లీగా ఏవో గొడవలు పడుతూండేవార నేందుకు బోల్డు దాఖలాలున్నాయి. ఇప్పుడు మీకు టైం లేదంటారా ? ఉన్న టైమునే సద్వినియోగం చేసుకోండి.

మొగుడ్ని డామినేట్ చెయ్యలేని ఆడది జీవితంలో సుఖపడ లేదు. మీవారో పెద్ద అల్సేసిషియన్ కుక్కలా భయంకరంగా వుంటారనుకోండి. ఆల్సేషియన్ కుక్కలకుకూడా కట్టడానికి బెల్టులూ, తాళ్ళూ, గొలుసులూ వుంటాయిగా— అవన్నీ తెచ్చి వుపయోగించండి. మీరుకూడా చీరమీద కోటువేసుగుని టోపీ పెట్టుగుని స్టిక్కు చేత్తోపట్టుగుని వేషాలెయ్యొచ్చు. బెడ్రూంలో మిమ్మల్ని అడిగేవారెవరు ? దటీజ్ యువర్ వ(ర)ల్డు. ఇలాటి సరదాలన్నీ ఒకరిద్దరు పిల్లలు పుట్టకముందే తీరిపోవాలి. తరవాతిహ డ్రెస్ రిహార్సల్స్కి టైముండదు.

పెద్దాళ్ళున్నకొంపల్లో కుర్రాళ్ళ కిలాటి చిన్నచిన్న సరదాలు తీరవు. అంతమందికీ రూమ్స్ వుండవు.... అమ్మదగ్గరో; అత్తయ్యదగ్గరో చాపమీద అమ్మాయి పడుకుంటే అబ్బాయి, హాల్లో ఫాన్క్రింద మడతమంచంవేసుకుని ఇలస్ట్రేటెడ్ వీక్లీ గుండెలమీద వేసుకుని నిద్రపోవాలి. జాయింట్ ఫామిలీస్లో జాయింట్ మిజరీ ఎక్కువగావుంటుంది. పెద్దాళ్ళ ప్రపంచం ఎక్కడ ఆఖరవుతుందో, కుర్రాళ్ళ ప్రపంచం ఎక్కడ ప్రారంభమవుతుందో గాడోన్లీ నోస్—. కొందరు బ్రూట్స్ మన కిటికీ పక్కనే మంచాలు వాల్చుకు పడుకుంటారు సి. ఐ. డీల్లా. అర్ధరాత్రప్పుడొస్తూంటారు మిడ్నైటు గెస్టులు.. ఈ గెస్టుదేవతలకు రూం యిచ్చేసి రెస్టాఫ్ది నైట్ ఏ వరండాల్లోనో చాప పరచుకునిదొర్లాలి. చిన్నవాళ్ళకు చిన్నచిన్న కోరికలుంటాయి. సరదాలుంటాయి. వాళ్ళ ఖర్మానికి వాళ్ళ నొదిలెయ్యాలే కాని వాళ్ళకి ఏకాంతం లేకుండాచేసి నవ్వుకోడం మహా ఘోరం.

చాలా సోకాల్డు రెస్పెక్టబుల్ ఫామిలీస్ అవి రెస్పెక్టబుల్ కావు. వాళ్లు తమమీద ఆధారపడి వున్నవాళ్ళ వ్యక్తిత్వాల్ని తీవ్రంగా హర్ట్ చేస్తారు. అంచేతే ఉద్యోగాలు కాంగానే యంగ్‌మెన్ పెళ్ళాల్ని తీసుకుని చల్ మోహనరంగా అని వేరడిపోతూవుంటారు. ఏకాంతకు కావలసిన ఏకాంతం ఆ కాంతకు వుండకపోతే కోడలుపిల్లలు కొడుకులికి స్ఫూర్తి యిచ్చి "అమ్మ కావాలా—బొమ్మ కావాలా" అని అడిగేస్తారు.

మొగుడ్ని హీరో చేసి ఆరాధించుకోవాలనుకునే అమ్మాయికి జాయింట్ ఫామిలీలో తన మొగుడి స్థానాన్నిబట్టి తనకు లభించే గౌరవంతో తృప్తిపడి ఎన్నాళ్ళని సర్దుకునిపోతుంది? అందుకే ఎప్పుడో ఒకప్పుడు 'చల్ మోహనరంగా' అని పాడుతుంది. నీకు నీవారూలేరు నాకు నావారులేరు ఏటిఒడ్డున యిల్లుకడదాం పదరా చల్ మోహనరంగా- ఏరువస్తే యీదిపోదాం పదరా అంటుంది.